క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

దామెర: మండలంలోని గూనిపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైయ్యాడు. స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. గూనిపర్తి గ్రామానికి చెందిన దొనికెల శ్రీకాంత్ మండలంలోని ల్యాదెళ్లలో ఓ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కాగా శ్రీకాంత్ తన షాపులో పనిచేయడం లేదని సదరు షాపు యజమాని ఈనెల 1వ తేదిన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ల్యాదెళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదు. దీంతో శ్రీకాంత్ తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్ 5ఫీట్ల8 ఇంచుల ఎత్తు, నలుపు రంగుతో ఉంటాడని, ఆచూకి తెలిసిన వారు 8712685220, 8712685228 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

మోటార్ అందజేత



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తొలగించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్నారై బాసాని వెంకటేశ్వర్లు సాయం అందించారు. రూ. 30వేల విలువ గల సబ్ మెర్సిబుల్ మోటార్‌ను మంగళవారం అందించారు. నీటి సమస్యలను తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య తన తోటి మిత్రుడు బాసాని వెంకటేశ్వర్లును కోరగా ఆయన స్పందించినట్లు తెలిపారు.

పాఠశాలల సందర్శన



ధర్మసాగర్(వేలేరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను అకాడమిక్ మానటరింగ్ ఆఫీసర్ (క్వాలిటీ కోఆర్డినేటర్) శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. వేలేరు, మల్లికుదుర్ల గ్రామాల్లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు గౌరిశెట్టి రాజన్న, జయసాగర్, ఎస్ఓ స్రవంతి, డీఎల్ఎంటీ రఘు, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



ధర్మసాగర్: మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ కోరారు. మూడు రోజులుగా కొనసాగుతున్న రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళలు బతుకమ్మ విగ్రహం వద్దకు వెళ్లేందుకు సీసీ రోడ్డు అవసరమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన కుడా నిధుల నుంచి రూ. 70 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగపురి మహేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు హౌజ్‌వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రవి తెలిపారు. వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, మలుగు, జనగాం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు శిక్షణకు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు కలిగి, తెలుపు రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 15 లోపు సంస్కృతి విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు 9704056322కు ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

హన్మకొండ : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని అప్పుడే ఉన్నత చదువులు, ఉద్యోగాల సాధనలో ముందు వరుసలో ఉంటారని కాకతీయ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మేఘనరావు సూచించారు. హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్ ముదిరి నాగరాజు రాసిన 'హైస్కూల్ ఇంగ్లిష్ గ్రామర్' పుస్తకాన్ని మంగళవారం ఆమె హాజరై ఆవిష్కరించారు. స్కూల్ ఆవరణలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాధాన్యతను వివరించారు. ప్రతిఒక్కరూ ఇంగ్లిష్‌ను నేర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ ఎంఈఓ శ్రీరామ్ కిషన్ రాజు, పీటీసీ ఇన్స్‌పెక్టర్ బానోతు కాశీరాం, కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, పాల్గొన్నారు.

మధ్యంతర భృతి 18 శాతం పెంచాలి

● నిరసన తెలిపిన ప్రభుత్వ ఉపాధ్యాయులు



శాయంపేట : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఐనవోలు: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐఆర్ 18 శాతం ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రావుల రమేష్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐదుశాతం మధ్యంతర భృతిని ప్రకటించడం మోస పూరితమని, ఇది అశాస్త్రీయంగా ఉందన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలమైన ప్రభుత్వాలు ఉద్యోగుల జీత భత్యాలు పెంచడంలో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. పీఆర్సీలో ఉద్యోగులకు రావాల్సిన 15 వాయిదాల ఏరియర్స్‌ను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అనేక ఆర్థిక పరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని వాపోయారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వెంటనే సరిచేసి 18 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు బీమళ్ల సారయ్య, భాస్కర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రకటించిన 5 శాతం మధ్యంతర భృతిని 18 శాతానికి పెంచి ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పత్తిపాక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ మధ్యంతర భృతి 5 శాతం ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పీఆర్సీ కాలపరిమితిని మూడు నెలలకు తగ్గించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులును చర్చలకు పిలిచి మధ్యంతరభృతి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత పీఆర్సీలో 36 నెలలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు ప్రకటించకుండా కేవలం 24 నెలల పీఆర్సీ ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా బాధ్యుడు రమేష్, పీఈటీ సంఘం నాయకుడు దేవేందర్, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, సంధ్యారాణి, ఉపాధ్యాయులు రఘు, రషీద్, నాగరాజు, నర్సయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టీపీటీఎఫ్ నాయకులు

బీఆర్ఎస్‌కు ఓటు అడిగే నైతికహక్కు లేదు



బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

దామెర: రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే నైతికహక్కు బీఆర్ఎస్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు మొలుగూరి భిక్షపతి అన్నారు. మండలంలోని పసరగొండలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వని కేసీఆర్ తన ఇంట్లో మాత్రం నాలుగు పదవులు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు బీఆర్ఎస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. పసరగొండ బీజేపీకి కంచుకోటగా నిలిస్తుందని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాం రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, భిక్షపతి, శ్రీలత, చంద్రకిరణ్, శ్రీనివాస్, ఐత రాజు, ఐత చేరాలు పాల్గొన్నారు.

డబ్బాలను తొలగించడం హేయమైన చర్య

పరకాల: పట్టణంలోని శ్రీమహంకాళి ఆలయ ప్రాంగణంలోని డబ్బాలను తొలగించడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబాలను రోడ్డున పడేయవద్దని డబ్బాల చిరు వ్యాపారులు అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న ధర్మారెడ్డికి డబ్బాల వ్యాపారస్తులు దండాలు పెట్టకపోవడంతోనే డబ్బాలు తొలగిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు తొత్తుగా మారిన కమిషనర్‌కు రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, గురుప్రసాద్, మేఘనాథ్, వెంకటస్వామి, రంజిత్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

దామెర: అర్హులందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీడీ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటుహక్కు, స్వచ్ఛతాహీ సేవ, సిటిజన్‌ఆప్‌పై మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేయడంతో పాటు సిటిజన్ ఆప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, డీపీఎం అనిల్, ఏపీఎం ఝాన్సీ, సీసీలు మాధవి, నగేష్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనావాస్

వైభవంగా అభయాంజనేయ ధనరాశి ఉత్సవం

● పూజలు నిర్వహించిన వేద పండితులు .

ధర్మసాగర్: మండల కేంద్రంలోని సాగర బతుకమ్మ ధర్మక్షేత్రం సమీపంలో శ్రీ అభయాంజనేయస్వామి ధనరాశి ఉత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రంగాచార్యులు, నర్సింహాచార్యులు, భాణు, భగవాన్, ప్రశాంత్ పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అభయాంజనేయస్వామి 41 అడుగుల విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని భక్తులు ధనరాశి రూపాయల బిళ్లలు, బంగారు, వెండి, రాగి బిళ్లలను విగ్రహ పాదాల వద్ద పోశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ఎంపీటీసీ రొండి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రపు రామేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ కూనూరు రాజు, రమేష్‌బాబు, సభ్యులు రఘుపతిరాజు, తోకల జయపాల్‌రెడ్డి, రమేష్, బాలరాజు, రమేష్, విజయ్, మల్లేష్, సదానందం, దేవేందర్, రవి, వెంకన్న, సాంబరాజు, శివ, గ్రామ పెద్దలు రఘు, ప్రభుదాస్, లాల్‌మహ్మద్, సాంబమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, సుమన్, కార్యదర్శి మహేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే మైదానాలు

శాయంపేట : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలను ఏర్పాటు చేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయలకు మంజూరైన క్రీడా కిట్లను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆమె మంగళవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

పార్టీ ఇన్సురెన్స్ చెక్కు అందజేత

తహరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాంబరి వినోద్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ ఇన్సూరెన్స్ నుంచి మంజూరైన రూ. 2లక్షల చెక్కును అందించారు. ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు రాజేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సదయ్య, సదానందం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



క్రీడా కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు



శాయంపేట: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ కార్డు స్కీంల కరపత్రాలను మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో పేదల సంక్షేమ కోసం ఇచ్చిన హామీలను అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రకటించిన డిక్లరేషన్‌లో 6 గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో అమలు చేసి తీరుతుందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. రవి, కుమారస్వామి, వలిహైదర్, రవిపాల్, రాజ్‌కుమార్, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్: ప్రచారం చేస్తున్న నాయకులు

ధర్మసాగర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అధికారంలోకి వచ్చిన వెంటనే ఖచ్చితంగా అమలు చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి (వైద్యవిభాగం) డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ అన్నారు. జానకిపురం, సోమదేవరపల్లి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆరు గ్యారంటీ స్కీంలను ప్రకటించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే హామీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేతి జయపాల్‌రెడ్డి, తూటి నర్సింహారెడ్డి, ఠాకూర్ ఉమ, చింత దేవదాస్, పోలు మహేందర్, పాలకుర్తి రాజు, గోనెల శ్రీనివాస్, గడ్డం దామోదర్, నర్సయ్య, కిష్టయ్య, ప్రభాకర్, రఘు, కుమార్, చార్లెస్, శ్రీకాంత్, రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్: దూపకుంట రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలి గంటి రత్నమాల డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ నాగేశ్వరరావుకు సీపీఎం పార్టీ నేతలతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం రత్నమాల మాట్లాడుతూ పడమరకోటలో రోడ్డు వెడల్పులో 500 మంది ఇళ్లు కోల్పోయిన బాధితులకు అప్పటి మంత్రి బస్వరాజు సారయ్య ఇళ్ల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. పట్టాలు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మైదం రత్నం, భాస్కర్, ప్రసాద్, ఎలిషమ్మ, సుజనా, సుకన్య, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

కరీమాబాద్ : నిలువ నీడలేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చి అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నారని తెలి పారు. నాయకులు గాదె రజిత, రాములు, అనసూర్య, సోను, సోనీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ర్యాంకులు

దామెర: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే మంచి ర్యాంకులు సాధిస్తారని సామాజికవేత్త డాక్టర్ పురాణం వెంకట్‌రాములు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు మోటివేషనల్ స్కిల్స్‌ను వివరించారు. అలాగే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇష్టపడి చదివినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆత్మవిశ్వాసంతో లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. పట్టుదల, కృషి ఉంటే విజయం వెంటే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, విజిలెన్స్ అధికారులు పాషా, అమ్జద్‌అలీ, అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్‌రాములు

డాక్టర్ రాజుకు సన్మానం

ఖిలా వరంగల్: మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రీ జయంతి సందర్భంగా ఖిలావరంగల్ పడమరకోటలో మంగళవారం లయన్స్‌క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపికైన ఉత్తమ వైద్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్టిక్ గవర్నర్ వెంకటేశ్వర్లు, ప్రతినిధులు శ్రీనివాస్, జారతి సత్యనాథ్ హాజరై ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌కు చెందిన డాక్టర్ మైదం రాజుకు మెమోంటోను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వృత్తి ఎంతో విలువైందని కొనియాడారు. ఏకశిలనగర్ కా లనీకి చెందిన ప్రతినిధులు డాక్టర్ మైదం రాజును కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేను రద్దు చేయాలి

● ప్రధాని, సీఎం దిష్టిబొమ్మల దహనం

పరకాల: నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దు చేయాలని కోరుతూ భూ నిర్వాసితులు పట్టణంలో మంగళవారం ఆందోళనకు దిగారు. 2018 సంవత్సరానికి ముందు మార్కెట్ ధరను చెల్లిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన భూనిర్వాసితులు తమ భూములను గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఇచ్చే ప్రసక్తే లేదంటూ వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో వ్యవసాయ భూములు కోల్పోతున్న పరకాల, భూపాలపల్లి డివిజన్‌లోని మండలాలకు చెందిన రైతులు పట్టణానికి చేరుకొని వ్యవసాయ మార్కెట్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో తమ వ్యవసాయ భూములు కోల్పోతున్నామని వారు తెలిపారు. అయినప్పటికీ రాజకీయ పార్టీల నాయకులు తమకు అండగా నిలవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు బొజ్జ రఘుపతి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పీఎం మోదీ, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న భూ నిర్వాసితులు

మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

నయీంనగర్ : మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం నగరంలోని 6వ డివిజన్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మైనార్టీ బంధు పథకాన్ని ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గతంలో అధికారంలోఉన్న ప్రభుత్వం మైనారిటీలను ఓట్ల కోసం మాత్రమే వాడుకుందని ఆరోపించారు. భారతదేశాన్ని ఎక్కువ కాలం పాలించినటువంటి కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. మైనారిటీ కుటుంబాలతో తనకు ఎన్నో ఏళ్లుగా సంబంధం ఉందని, అలా నా ప్రతి విజయంలో వారి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ధన్యవా దాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతేయాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ముస్లిం మత పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

కాట్రపల్లిని శాయంపేటలోనే కొనసాగించాలి

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామాన్ని కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలంలో కాకుండా శాయంపేట మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆర్డీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి మంగళవారం వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామ ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలని కోరారు. ఉన్న పలంగా నిర్ణయం తీసుకోవద్దని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అర్హులందరికీ 'బీసీబంధు' ఇవ్వాలి

ఆత్మకూరు: అర్హులందరికీ బీసీబంధు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు, మల్కపేట గ్రామాల్లో మంగళవారం మహాజనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులకు పదవులు వచ్చాయని, రాష్ట్రంలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి జాడలేదన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్‌కు భరోసా ఐఐటీ జామ్

కేయూ క్యాంపస్: దేశంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదవడం కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబర్ 13తో ముగుస్తుంది. ఇంటర్మీడియట్ ద్వారా ఐఐటీలో చదవాలన్న ఆశయం నెరవేరకపోతే డిగ్రీ ద్వారా ఐఐటీలో చదవడానికి విద్యార్థులకు మరొక అవకాశం జామ్. దీనిపై విద్యార్థుల్లో అవగాహన లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో జామ్ ఎంట్రెన్స్ రాసే విద్యార్థుల సంఖ్య బాగా తక్కువగా ఉంది. అక్టోబర్ 5న ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జామ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ మద్రాస్ ఆచార్యులు బీరయ్య రానున్నట్లు గణిత విభాగ ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ అంజన్‌రావు తెలిపారు.